క్లుప్తంగా

మాన్యం కౌలుకు వేలం

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వర స్వామి, భోగేశ్వరస్వామి, అగస్తీశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు శనివారం వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ. 2.65 లక్షలు లభించిందని ఈఓ చంద్రుడు తెలిపారు. శనివారం స్థానిక శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయా ఆలయాలకు సంబంధించిన 51.83 ఎకరాలకు రైతుల సమక్షంలో వేలం నిర్వహించారు. హెచ్చు పాట పాడి దక్కించుకున్న రైతులకు సాగు చేసుకునేందుకు ఒక ఏడాది కాలానికి భూములను కౌలుకు అప్పగించినట్లు ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శీలం హరిశ్చంద్ర నాగిరెడ్డి, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య సేవకు పునరంకితం కావాలి


ప్రతిజ్ఞ చేస్తున్న పశువైద్యులు

నంద్యాల(అర్బన్): పశువైద్యులు పశువుల సేవకు పునరంకితం కావాలని జిల్లా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ కేవీ వీరబ్రహ్మం కోరారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని తేజశ్విని ఫంక్షన్ హాల్‌లో శనివారం జిల్లా స్థాయి పశువైద్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నుంచి మానవులకు ప్రబలే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వైద్యులు కొండారెడ్డి, వసంతలక్ష్మి, నాగరాజు, రవిబాబు, జుబేర్, అరుణ పాల్గొన్నారు.

8 నుంచి సమ్మర్ క్యాంప్

శిరివెళ్ల: మే 8వ తేదీ నుంచి గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ సునీత శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 6–10వ తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన, కోచింగ్ ఇస్తామన్నారు. 8వ తేదీ నుంచి జూన్ 16వరకు జరగనున్న క్యాంప్‌లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 8.30 వరకు కథలు వినిపించడం, వినగలిగే సామర్థ్యం పెంపొందిస్తామని చెప్పారు. 8.30 నుంచి 10 గంటల వరకు పుస్తకాలు చదవడం, 10 నుంచి 10.10 గంటల వరకు విరామం, 10.10 నుంచి 10.30 గంటల వరకు పుస్తక సమీక్ష, 10.30 నుంచి 11 వరకు కథలు చెప్పడం, ఉదయం 11 గంటల నుంచి 12 వరకు స్పోకెన్ ఇంగ్లిష్,డ్రాయింగ్,పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, అతిథుల ప్రసంగాలు, డ్రామా, బొమ్మల తయారీ వంటివి నేర్పిస్తామని వివరించారు.

ప్రసాద్‌కు పురస్కారం


కవిమిత్ర పురస్కారాన్ని అందుకుంటున్న కొప్పుల ప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన కవి కొప్పుల ప్రసాద్‌కు కవన కిరణాలు, తెలుగు సాహిత్య సమాఖ్య, ముంబాయి వారు కవి మిత్ర పురస్కారాన్ని శనివారం అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కవన కిరణాలు, తెలుగు సాహితీ సమాఖ్య గ్రూపులో ప్రతి రోజూ తన రచనలతో సాహితీ మిత్రులను అలరిస్తున్నందుకు సాహిత్యాభిలాష గుర్తించి పురస్కారం అందజేసిందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిద్ధారెడ్డి, బైస దేవదాసు, నేటినిజం పత్రికా సంపాదకులు, కవన కిరణాల వ్యవస్థాపకులు శివ మంచాల పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు

దొర్నిపాడు: ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డాక్టర్ నాగేంద్ర పేర్కొన్నారు. శనివారం దొర్నిపాడుకు చెందిన లక్ష్మమ్మ అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో ఉదయం 4గంటలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన డాక్టర్ 4:30 గంటలకు వైద్యశాలలోనే సహజ కాన్పు చేశారు. దీంతో తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు చెప్పారు. వెంటనే జీరో డోస్ టీకాలు వేశామని, ఈ నెలలో ఇప్పటి వరకు మూడు కాన్పులను ఎలాంటి ఇబ్బందులు లేకుడా చేశామన్నారు. డాక్టర్ రుహుల్లాఖాన్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో శ్రీకొట్టి సుబ్బమ్మ, బాలాజీ మర్చెంట్స్ కల్యాణ మండపంలో శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు కొట్టి చంద్రశేఖర్, కార్యదర్శి నారాయణ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఆదివారం పద్మావతి శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపించామని చెప్పారు.

వేసవి దుక్కులతో ప్రయోజనం

- వాలుకు అడ్డంగా దున్నాలి
- లోతుగా దున్నితేనే ఫలితం
- దున్నే ముందు సేంద్రియ ఎరువులు చల్లాలి
- జీవాలను ఆపితే భూసారం పెరుగుదల


ఎండ సేద్యం చేస్తున్న రైతు

నంద్యాల(అర్బన్): నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, జొన్న, మినుము, పెసర, మిరప తదితర పంట ఉత్పత్తులు రైతుల చేతికి అందాయి. వేసవి కాలం ఆరంభంలోనే ఎండలు ఎక్కువ అవుతున్న తరుణంలో ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవి దుక్కులు చేపడితే కలుపు మొక్కలు, వాటి విత్తనాలు నేల పై పొరల్లోకి చేరి అధిక ఉష్ణోగ్రతకు గురై నశిస్తాయి.

దుక్కులు చేయకుండా వదిలేస్తే..

రైతులు పంటలు చేతికి వచ్చాక వర్షకాలం వచ్చేంత వరకు భూములను ఖాళీగా ఉంచడం మంచిది కాదు. భూములు ఖాళీగా వదిలేయడం వల్ల కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమిలో సత్తువ లేకుండా చేస్తాయి. దీని వల్ల భూసారం తగ్గిపోవడమే కాక నీరు భూమి లోపలి పొరల నుంచి గ్రహించి ఆవిరై పోతుంది.

వర్షాలకు ముందు దున్నితే..

తొలకరి వర్షాలకు ముందే భూమిని వాలుకు అడ్డకుండా, లోతుగా దున్నుకోవాలి. తొలకరి వర్షాలు కురవగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది. వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో పాటు భూమి ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుంది. దీని ప్రభావం పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. లో దుక్కుల వల్ల భూమి పొరలు తిరగబడి నేల సారవంతమవుతుంది. ఇలా చేయడం వల్ల భూమిలో తేమ శాతం పెరిగి భూసార అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యజమాన్యం, కలుపు మొక్కల నివారణ తదితర ప్రయోజనాలు చేకూరుతాయి.

జీవాలను ఆపాలి..

వేసవి దుక్కులు దున్నే ముందు ఖాళీ పొలాల్లో గొర్రెలు, మేకలు పశువులను ఆపాలి. అవి విసర్జించే మల మూత్రాలు భూమిలోకి చేరడం వల్ల సేంద్రియ కర్బనం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. కంపోస్టు లేదా చెరువు మట్టి వెదజల్లడం వల్ల నేల సారవంతంగా మారి మంచి దిగుబడులు లభిస్తాయి.

కలుపు యాజమాన్యం..

సాధారణంగా పంట లేని సమయంలో కలుపు మొక్కలు పెరగడం సహజం. ఇవి నేలలోని నీరు, పోషకాలను గ్రహించి పంట దిగుబడిని తగ్గిస్తాయి. అనేక రకాల పురుగులు, శిలీంద్రాలకు కలుపు మొక్కలు ప్రత్యామ్నాయంగా పనిచేస్తాయి. వేసవి దుక్కులతో ఇలాంటి మొక్కలు, వాటి విత్తనాలు బయటకు తేలి అధిక ఉష్ణోగ్రతకు గురై నశిస్తాయి. దీని వల్ల శిలీంద్రాల జీవిత దశలు ఆలస్యమవడం ద్వారా పంటలను తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చు.

పురుగు, తెగుళ్ల నివారణ..

వేసవి కాలంలో భూమి ఖాళీగా ఉండటం వల్ల అనేక రకాల పురుగులు, చెత్తా చెదారంలో, కొయ్య కాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలిగించే శిలీంద్రాలు భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వాటి శిలీంద్ర బీజాలు భూమిలోనే ఉండిపోతాయి. లో దుక్కుల వల్ల నిద్రావస్థ దశలో భూమిలో ఉన్న చీడ పీడల లార్వాలు, ప్యూపాలు బయటపడి అధిక ఉష్ణోగ్రతకు చనిపోతాయి. బయట పడిన లార్వాలను పక్షులు తిని నాశనం చేస్తాయి. లోపలి పొరల్లో ఉన్న శిలీంద్ర బీజాలు మట్టితోపాటు నేలలో కలిసిపోతాయి. ఇవి అధిక ఉష్ణోగ్రతకు గురై వ్యాధులను కలుగజేసే శక్తిని కోల్పోతాయి.

వాలుకు అడ్డంగా దుక్కులు దున్నుకోవాలి



తొలకరి వర్షాలకు ముందే భూమిని వాలుకు అడ్డంగా, లోతుగా దున్నుకోవాలి. వర్షాలు కురవగానే నీరు భూమిలోకి ఇంకడంతో భూమి ఆ తేమను గ్రహించి నిల్వ చేసుకుంటుంది. ఈ ప్రభావం పంట దిగుబడుల మీద చూపుతుంది. లోతు దుక్కుల వల్ల భూమి పొరలు తిరగబడి నేల సారవంతమవుతుంది. దుక్కులు చేయకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను కలుపు మొక్కలు గ్రహించి భూమిని నిస్సారంగా చేస్తాయి. – రాజశేఖర్, ఏడీఏ, నంద్యాల

వాసవీ మాతకు చీరలతో సహస్రార్చన


సామూహిక వ్రతంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రెండో రోజు అమ్మవారికి 1008 చీరలతో సహస్రార్చన వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చీరలతో అర్చన జరిపించారు. అలాగే సామూహిక గౌరీ వ్రతం చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశివాసు, సంఘం మహిళా అధ్యక్షురాలు తాడువాయి ఇందుమతి, కార్యదర్శి శోభారాణి పాల్గొన్నారు.

మే నుంచి చౌక దుకాణాల్లో జొన్నల పంపిణీ

శిరివెళ్ల: మే నెల నుంచి చౌక దుకాణాల్లో కార్డుదారులకు ఉచితంగా జొన్నలు పంపిణీ చేస్తారని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ తెలిపా. శనివారం చౌక దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు బియ్యంను అధికంగా తినడం వలన డీ విటమిన్ లోపం ఏర్పడిందని శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వడంతో బియ్యం పరిమాణంలో కొంత మేరకు అంటే ప్రజల ఇష్టంతోనే కార్డుకు 3 కేజీల జొన్నలను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. బియ్యం, కంది పప్పు, చక్కెరకు అదనంగా జొన్నలు ఇస్తారని వివరించారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ ఉద్దేశం


మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ఉద్దేశమని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణలో మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, బీమా, మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను న్యాయస్థానాల్లో కాకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు, అధికారులు ఉపయోగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులు తీర్పుపై అప్పీలు ఉండదని స్పష్టం చేశారు. మే 13న జరిగే మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, రఘుప్రకాష్, ముక్కెర కృష్ణారెడ్డి, మున్సిపల్ ఆర్‌ఐ వరప్రసాద్, బ్యాంకు అధికారులు, లోక్ అదాలత్ అధికారులు రామచంద్రారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలనేదే లక్ష్యం

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- సంక్షేమం కోసం రూ.11.04 కోట్లు ఖర్చు
- 4,768 మందికి లబ్ధి
- దొర్నిపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


అవ్వా..పథకాలు అందుతున్నాయా.. అంటూ దివ్యాంగ వృద్ధురాలిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే గంగుల

దొర్నిపాడు: సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, వారి జీవితాల్లో వెలుగులు నింపేంత వరకు జగనన్న విశ్రమించరని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం దొర్నిపాడు సచివాలయం–1లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుతీరును తెలుసుకొని, గతంలో అందిన పథకాలు, నేడు అందుతున్న పథకాల గురించి, చేకూరిన లబ్ధి, పాలనలో తేడాలను వివరించారు. వారికి అందిన పథకాలను చదివి వినిపించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఆసరా 194, అమ్మ ఒడి 185, చేదోడు 48, వైఎస్సార్ పింఛన్లు 228, జగనన్న విద్యాదీవెన 150, వైఎస్సార్ రైతు భరోసా, 318, సున్నావడ్డీ రుణాలు 116, వైఎస్సార్ చేయూత 94.. ఇలా నాగుగేళ్లలో 4,768 మంది లబ్ధిదారులకు ఈ సచివాలయ పరిధిలోనే రూ. 11.04 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. బీసీ కాలనీలోని రామక్క అనే విద్యాంగ వృద్ధురాలు ట్రైసైకిల్ కావాలని కోరగా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు ప్రస్తావించిన పలు సమస్యలను వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వర రావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచులు దేవమణి, శివరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, నాయకులు మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, బత్తుల రాజు, కాకనూరు మనోహర్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రఫీ, శాంతయ్య, చిన్నమద్దిలేటి, వైస్ ఎంపీపీ లక్ష్మిరెడ్డి, నడిపెన్న, తిరుపతయ్య, రాంప్రసాద్‌రెడ్డి, బత్తుల కృష్ణయ్య, పాదం శీను, కొండయ్య, శ్రీపతి ప్రసాద్, నాగేష్, గంగుల రామిరెడ్డి, ఎస్‌ఎంపీ చైర్మన్ నర్సిరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మిదేవి, ఎంపీడీఓ నాగ అనసూయ, ఎంఈఓ కరీం, ఏఓ శ్రీకృష్ణ, టీడీ వెంకట రవి, లైన్‌మేన్ నాగన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, వర్క్ఇన్స్‌పెక్టర్ బ్రహ్మం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో టీడీపీ నాయకుల్లో వణుకు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల ఆనందం చూస్తుంటే టీడీపీ నాయకుల్లో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఈనెల 7నుంచి 29వ తేదీ వరకు జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముగింపు సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజను ఇళ్లవద్ద కూర్చోబెట్టి సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు ఇస్తున్నారని, వారిని సోమరులుగా చేస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శించే టీడీపీ నాయకులకు.. పథకాలను తొలగిస్తామని చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని యువగళంలో చెబుతుండటమే మీ భయాన్ని తెలియజేస్తుందన్నారు. నియోజకర్గంలో 98,756 ఇళ్లను గృహసారథులు, సచివాలయ, మండల కన్వీనర్లు సందర్శించగా 91,130 కుటుంబాలు జగనన్న ప్రభుత్వం పనితీరు భేష్ అంటూ మద్దతు తెలిపారని చెప్పారు. దీంతో రాష్ట్రంలోని 157 నియోజకవర్గాల్లో పదో స్థానంలో ఆళ్లగడ్డ నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు మంచి వైపే నిలబడి మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వాన్ని విమర్శించడమే ఆ పార్టీ ధ్యేయంగా పెట్టుకుందని, కానీ తాము ప్రజలకు ఏమి చేశామో చెప్పుకోలేకపోతున్నారన్నారు. కేవలం రాజకీయ ఉనికి కాపాడుకోవడానికి చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ మాట్లడనని చెప్పారు. మీవల్ల ఎవరు నష్టపోయారో వారితోనే ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయిస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, ఎంపీపీలు అమర్‌నాథ్‌రెడ్డి, నాయక్ వసీం, నాయకులు షేక్‌బాబులాల్, కుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నజీర్, మనోహర్‌రెడ్డి, గంగుల రామిరెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షం..రైతుల్లో భయం

బి.నాగిరెడ్డిపల్లె వద్ద నేలవాలిన వరి పైరు


రుద్రవరం: కురుస్తున్న అకాల వర్షాలతో రైతుల్లో భయం తీవ్రమైంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రబీ సీజన్‌లో వరి,మొక్క జొన్న, మినుము వంటి పంటల నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. అయితే ఇప్పటి వరకు వాతావరణం అనుకూలించడంతో పైరు ఆశాజనకంగా ఉండటంతో మంచి దిగుబడి వస్తుందని ఆశగా ఉన్నారు. అయితే ఇటీవల కురుస్తుండటంతో వరి పైరు నేల వాలుతోంది. అలాగే మొక్కజొన్న, జొన్న, మినుములు పంటలు రంగుమారతాయోమోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే దిగుబడి పూర్తిగా పడిపోయే ప్రమాదముందని చెబుతున్నారు. వర్షాల కారణంగా రైతులు వరి ధాన్యాన్ని పసిమి మీదనే విక్రయిస్తున్నారు. ఇంకొందరు ధాన్యాన్ని కోసి ఆరుబయట ప్రాంతాల్లో ఆరబోసుకుంటున్నారు. ఇలా ఆరబోసుకున్న ధాన్యం వర్షానికి తడిసిపోతుండటంతో రక్షించుకోవడానికి అవస్థలు పడుతున్నారు. శనివారం తెల్లవారు జామున, సాయంత్రం మండలంలోని బీ.నాగిరెడ్డిపల్లె, రుద్రవరం, పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిన్నకంబలూరు తదితర గ్రామాల్లో ఉరుములు,మెరుపులతో వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల పరిధిలో కోత దశలో ఉన్న పంటలు నేలవాలాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు నట్టేట ముంచు తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

- అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం


కౌన్సిల్‌కు హాజరైన సభ్యులు,(ఇన్‌సెట్) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల అభివృద్ధిపై మున్సిపల్ కౌన్సిల్‌లో వాడీ వేడి చర్చ జరిగింది. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా ఎన్నో దశాబ్దాలుగా నంద్యాల ప్రజల నీటి కష్టాలను తొలగించినందున ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి కౌన్సిల్ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యుడు సలాముల్లా మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశ పెట్టే అజెండా అంశాలలో ప్రజలకు అవసరమైన పనులను చేర్చడం శుభసూచకని, అయితే ప్రతి నెలా టేబుల్ అజెండా పెట్టడంలో అధికారుల ఆంతర్యమేమిటో తెలియజేయాలన్నారు. ప్రతి సమావేశానికి మూడు రోజుల ముందు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టే అంశాల ప్రతులను సభ్యులకు అందజేయాల్సి ఉండగా ఒక రోజు ముందు ఇస్తుండటంతో కౌన్సిలర్లు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ప్రజల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడంపై కో ఆప్షన్ సభ్యులు శోభారాణి, అబ్దుల్ సమ్మద్, షెహనాజ్ హర్షం వ్యక్తం చేశారు.

'అమృత్' తెచ్చింది ఎవరో తెలుసుకోండి..

నంద్యాల పట్టణానికి శాశ్వతంగా నీటిని అందించేందు కృషి చేసింది శిల్పా కుటుంబమేని పడకండ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. అయితే టీడీపీ నాయకులు మాత్రం తామే చేశామని భ్రమల్లో విహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అమృత్ కేంద్రానిదని, ఈ పథకానికి 30-04-2017లో నంద్యాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ శిల్పా మోహన్‌రెడ్డి చొరవతో కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. నాటి చైర్‌పర్సన్ దేశం సులోచన అప్పటి డీఎంఏ కన్నబాబును కలిసి ఢిల్లీకి వెళ్లి డీపీఆర్ అందజేశారని గుర్తుచేశారు.

నంద్యాల అభివృద్ధి పై ఫోటో ప్రదర్శన..

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఫొటో ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల పై ఒక ప్రత్యే వీడియోను రూపొందించి సభ్యులకు ప్రదర్శించారు.మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి ఉన్నారు.

మురుగు కాల్వ ఏర్పాటులో ఘర్షణ

గోస్పాడు: మండలంలోని ఒంటివెలగల గ్రామంలో 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మద్దిలేటి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సత్తెనపల్లి దానం, బాలకృష్ణ మధ్య మురుగు కాల్వ ఏర్పాటు విషయంలో ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. సత్తెనపల్లి దానం, ప్రభాకర్, మనిపాల్, రాజుతో పాటు మరో ఐదుగురు, మరో వర్గానికి చెందిన బాలకృష్ణ, బాలయ్య, సురేష్ , సుబ్బరాయుడుతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య


మృతి చెందిన లక్ష్మీదేవి

శిరివెళ్ల: ఇసుకపల్లెకు చెందిన నిమ్మకాయల లక్ష్మీదేవి (77)ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో భాధపడుతుండేదని, భరించలేక పురుగు మందు సేవించి అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. భర్త నడిపి నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కుటుంబ సమస్యలతో..

రుద్రవరం: మండలంలోని నల్లవాగుపల్లెలో సులోచన (32) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కుటుంబ సమస్యల కారణంతో మనస్థాపానికి గురైన అమె పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ అబ్దుల్‌కరీం కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేస్తున్న పలు అంశాలపై ప్రత్యేకంగా ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను అందజేశారు.

హజ్ యాత్రికులకు శిక్షణ తరగతులు


ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను సన్మానించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లా హజ్ యాత్రికులకు ప్రత్యేక శిక్షణ తరగతులను స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఇంతియాజ్‌అహమ్మద్ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం 300 మందికి ఒక వలంటీర్‌ను నియమించిందని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 150 మందికి ఒక వలంటీర్‌ను నియమిస్తూ ప్రత్యేక సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. అలాగే.. హజ్‌యాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యేక నిబంధనలను యాత్రికులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్సీని ముస్లింలు సన్మానించారు.మౌలానా అబ్దుల్ మజీద్ సాహెబ్, అఫీజ్ అబ్దుల్‌సలాం సాహెబ్ పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకృష్ణ కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పద్మావతినగర్‌లో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో శనివారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 40 రోజులు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణాన్ని శ్రీకృష్ణ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు చేపట్టి విశేషంగా అలంకరించారు. అనంతరం నవగ్రహ పూజ, మండలి పూజ, సామూహిక హోమాలు జరిపించారు. సాయంత్రం జగద్గురు శంకరాచార్య శ్రీ హంపీ వీరుపాక్ష పీఠాధిపతి శ్రీభారతి స్వామి భక్తులకు శ్రీకృష్ణ భగవానుడి ప్రవచనాలు వినిపించారు. అనంతరం వేదపండితులు యాదవల్లి కార్తీకేయశర్మ ఆధ్వర్యంలో కల్యాణ తంతును శాస్త్రోక్తంగా, వేద మంత్రాల సాక్షిగా పూర్తి చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.వందకే విద్యుత్ కనెక్షన్

నంద్యాల(రూరల్): ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రూ.వందకే నూతన విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నామని పట్టణ డి1 సెక్షన్ ఏఈ నాగరాజు తెలిపారు. శనివారం పట్టణంలోని హరిజనపేటలో 22 గృహాలకు నూతన విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు